క్లుప్తంగా

నేడు వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో పలుచోట్ల ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఐదో వార్డు క్రిష్టియన్‌పాలెం, 9.15 గంటలకు రెడ్డినగర్, 9.30కు 24వ వార్డు రామిరెడ్డిపేట పాత సమితి కార్యాలయ సెంటర్, 10 గంటలకు 22వ వార్డు రామిరెడ్డిపేట, 10.15కు 32వ వార్డు బరంపేట మిట్టబజారు, 10.30కు 34వ వార్డు బీసీ కాలనీ, 10.45కు సీబీ కాలనీ, 11 గంటలకు ప్రకాష్‌నగర్ రిక్షాసెంటర్, 11.15కు ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డు, 11.30కు 12వ వార్డు షాలెంనగర్‌లలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించటం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ ఉదయం 9గంటలకు గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ కె.నాగేశ్వరరావు



నరసరావుపేట టౌన్: వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన వినాయక చవితిని పురస్కరించుకొని నరసరావుపేట డివిజన్ పరిధిలో వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకోవటానికి ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది తోకమిటీగా ఏర్పడి వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలని కోరారు. నిర్వాహకులు గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ అదే విధంగా ప్రైవేట్ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయదలిచిన వారు ప్రదేశం వివరాలు తెలియజేయాలన్నారు. అదే విధంగా విగ్రహం, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏరోజు జరుగుతుంది, నిమజ్జనం ఎప్పుడు చేస్తారు వంటి వివరాలను దరఖాస్తులో పొందుపరచాలన్నారు. ముందస్తు పోలీస్ శాఖ అనుమతి లేకుండా రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూరగాయలు, బియ్యం పంపిణీ

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ సెక్రెటరీ బెల్లంకొండ అనిల్ ఆధ్వర్యంలో వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న సుమారు రెండు వందల కుటుంబాలకు బియ్యం, కూరగాయల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ వేర్వేరుగా హాజరై పంపిణీలో పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు కపలవాయి విజయకుమార్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో అత్యధిక వర్షపాతం

రొంపిచర్ల: డివిజన్‌లో కుండపోతగా వర్షం కురిసింది. డివిజన్ మొత్తంలో ఆదివారం ఉదయానికి 1198.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 119.8 వర్షపాతం నమోదైంది. డివిజన్‌లోనే అత్యధిక వర్షపాతం మండల కేంద్రమైన రొంపిచర్లలో 248.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. కాగా నరసరావుపేటలో 125.4 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా బొల్లాపల్లిలో 148.0 శావల్యాపురంలో 116.0, చిలకలూరిపేటలో 106.2, యడ్లపాడులో 97.4, నూజెండ్ల 92.6, ఈపూరు 94.8, వినుకొండ 85.8, నాదెండ్ల 83.8 ఎం.ఎం వర్షపాతం నమోదైంది.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

శావలాపురం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు నష్టం వాటిల్లినప్పుడు ఈ-పంట నమోదు చేసుకున్న రైతులందరికీ ప్రభుత్వ పరంగా బీమా సౌకర్యం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురంలో మొక్కజొన్న, దోస పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి నారుమడులు, మొక్కజొన్న, మిరప, పొగాకు, పత్తి పొలాలు సాగు చేసిన పొలాల్లోకి వర్షం నీరు నిల్వ ఉండకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు సస్యరక్షణ చర్యలు రైతులు చేపట్టాలన్నారు.

విద్యార్థులు అదృశ్యం

నరసరావుపేట టౌన్: ఇద్దరు విద్యార్థులు అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయచరణ్ ఆదివారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన అబ్దుల్ కరీం రెండో కుమారుడు అబ్దుల్ అలీంను మందలించటంతో అలిగి ఇంటి నుంచి శనివారం వెళ్లాడు. విచారించగా అలీం, అతని స్నేహితుడు కేసన సాయితో కలసి వెళ్లినట్లు తెలుసుకున్నారు. దీంతో ఇద్దరి కుటుంబ సభ్యులు వారికోసం వెతికినా ప్రయోజనం దక్కలేదు. ఇద్దరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఈ మేరకు విద్యార్థుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- కొన్ని చోట్ల రాకపోకలపై నిషేధం
- పంట పొలాల్లో వర్షం నీరు

నాదెండ్ల: తుఫాన్ ప్రభావంతో వాగులు, వంకలు పొంగాయి. గురువారం ఏకధాటిగా కురుస్తున్న వర్షం ఆదివారం తగ్గుముఖం పట్టింది. రెండు రోజుల పాటూ కురిసిన వర్షం కారణంగా పంట పొలాలు నీట మునిగాయి. గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్లే కుప్పగంజివాగు పొంగి చప్టాపై నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. నాదెండ్ల దంతెలవాగు, గొరిజవోలు ఉబ్బల వాగు పొంగి ప్రవహించాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతి వాగు వద్ద రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కాపలా కాశారు. గణపవరంలో కుప్పగంజివాగును తహసీల్దార్ ఏవీ రమణ, ఆర్ఐ రమీజా, వీఆర్వోలతో కలసి పరిశీలించారు. అర్ధరాత్రి వాగు ఉధృతిని రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ జి.పుల్లారావు పరిశీలించారు. వాగు సమీపంలో నివసిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వరద దృష్ట్యా అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొన్ని ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. గణపవరం కుప్పగంజివాగు వద్ద పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచి ఎస్ఐ సమందర్‌వలి పహారా నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు.

కొంకెరువాగు ఉధృతి..



గొరిజవోలు ఉబ్బల వాగు వద్ద పోలీస పహారా

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు, చినకంచర్ల గ్రామాల్లో కొంకెరు వాగు వర్షం నీరు ఉధృతి ఆదివారం పెరగంతో పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆయా గ్రామాల పరిధిలో గ్రామస్తులు ఇరువైపుల రాకపోకలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు సూచించారు.

బైకులకు మాత్రం అనుమతి నిషేధమన్నారు. చినకంచర్ల గ్రామ సమీపంలోని కొంకెరువాగు వంతెనపై నుంచి వర్షపు నీరు ఉధృతి ధాటికి ప్రజలు రాకపోకలు నిలిపివేశారు. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు సారథ్యంలో పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పొక్లెయిన్‌తో వంతెన పైపుల మధ్య అడ్డుగా ఉన్న ముళ్ల కంచె తొలిగింపు పనులు చేపట్టారు. పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆటోలు, బైకులు రాకపోకలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆయనతో పాటు వీఆర్వో ఉప్పుటూరి చిన మంగయ్య ఉన్నారు.



విప్పర్లపల్లి సమీపంలోని ఏడుగడియల వాగు చప్టా వద్ద వరద నీటికి అడ్డుగా ఉన్న అడ్డంకులను తొలగిస్తున్న పొక్లెయిన్



గణపవరం కుప్పగంజివాగు వద్ద బందోబస్తులో స్పెషల్ బ్రాంచి ఎస్ఐ సమందర్‌వలి

వరద నీటి ప్రవాహానికి అడ్డు తొలగింపు

రొంపిచర్ల: మండలంలో ఉధృతిగా ప్రవహిస్తున్న వాగులను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆదివారం పరిశీలించారు. వరదనీరు ప్రవాహానికి అడ్డుగా నిలుస్తున్న ఆటంకాలను తొలగించే పనులను చేపట్టారు. లోలెవెల్ చప్టాలు, బ్రిడ్జిలు, రోడ్లపై ప్రవాహాలకు అడ్డుపడ్డ చెత్తాచెదారం, తూటాకు, మొద్దులు, చెట్లకొమ్మలను తొలగించారు. అడ్డు తొలగించటంతో వరద నీరు ప్రవాహం మట్టం తగ్గి కొంతమేర రాకపోకలకు అంతరాయం తొలగింది.

నీట మునిగిన పొలాల పరిశీలన

మండలంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను వ్యవసాయ అధికారులు ఆదివారం పరిశీలించారు. మండలంలోని కొత్తపల్లి, చాకలికుంటతండా, విప్పర్ల, రెడ్డిపాలెం, ఎడ్వర్డ్‌పేట, రొంపిచర్ల తదితర గ్రామాల్లో వ్యవసాయ అధికారుల బృందం పర్యటించింది. పర్యటనలో పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట్రాములు, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి శివలలిత పాల్గొన్నారు.



గణపవరం కుప్పగంజివాగు సమీపంలో ఇంట్లోకి చేరిన వరద నీరు



రొంపిచర్ల, చపారపు సుబ్బారెడ్డి గ్రామాల మధ్య ఉధృతిగా ప్రవహిస్తున్న కారంపూడి వాగు

ఉధృతిగా ప్రవహిస్తున్న వాగులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో వాగులు ఉధృతిగా ప్రవహించాయి. మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలో కారంపూడి వాగు ఉధృతితో రొంపిచర్లకు చపారపు సుబ్బారెడ్డి కాలనీకి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే గాడిదల వాగు, చక్రాలవాగు, నక్కలవాగు, కొండవాగు, గొల్లవాగు, చవిటివాగు, ఎద్దువాగు, ఊరవవాగు, ఓగేరువాగు, ఏడుగడియలవాగులు తదతర వాగులన్నీ ప్రమాద స్థాయిలో ప్రవహించాయి. ఓగేరువాగు ఉధృతి వల్ల మాచవరం, మునుమాక, ముత్తనపల్లి గ్రామం వద్ద రాకపోకలు నిలిచాయి. గాడిదల వాగు, చక్రాలవాగు, చవిటివాగుల పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలన్ని చెరువులను తలపించాయి.

ముంపు బాధిత ప్రాంతాల్లో తహసీల్దార్..

పురాతన గృహాల్లో మట్టి మిద్దెల్లో ఉండేవారంతా వర్షం కారణంగా సురక్షితమైన భవనాల్లోకి వెళ్లాలని తహసీల్దార్ బి.నిర్మల అన్నారు. మండలంలోని చాకలికుంట తండాలో ఆమె ఆదివారం పర్యటించారు. ఆ తండాలో పురాతన గృహాల్లో ఉంటున్న ఐదు కుటుంబాలను గుర్తించారు. వారంతా తండాలో దగ్గర్లో ఉన్న పాఠశాల భవనంలోకి వెళ్లాలని ఆమె వారికి సూచించారు. ఈ మేరకు కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వర్షం వస్తే పాఠశాల్లోకి వెళ్తామని ఆ గృహాల వారు తెలిపారు. అలాగే వర్షానికి పడిపోయిన హంసావత్ చిన తులసీనాయక్ గృహాన్ని పరిశీలించారు. ఈ వర్షానికి తుంగపాడులో కమలమ్మ పూరిల్లు కూలిపోయింది.

ముంపునకు గురైన రాజుపాలెం ఎస్సీ కాలనీ

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని రాజుపాలెం ఎస్సీ కాలనీ ముంపునకు గురైంది.

వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

నరసరావుపేట: రెండురోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలో పలుచోట్ల రోడ్లపైకి పారుతున్న వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం పరిశీలించారు. పట్టణ శివారు వల్లప్పచెరువులోకి పలు ప్రదేశాల నుంచి వర్షం నీరు వచ్చి చేరటంతో చెరువు నిండి అలుగు ద్వారా పక్కనే ఉన్న రోడ్డుపైకి పారింది. అలాగే గుంటూరు రోడ్డు స్వర్గపురి శ్మశాన వాటికకు ఎదురుగా ఉన్న గుంటూరురోడ్డుపైకి వర్షపు నీరు ప్రవహించింది. ఆయా మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆయా ప్రదేశాలను ఎమ్మెల్యే డాక్టర్ పరిశీలించారు. అలాగే సత్తెనపల్లిరోడ్డు స్టేడియం పక్కగా ఉన్న కత్తవ డ్రెయిన్‌లో అడ్డుపడిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తుండగా ఆ పనులను పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరారు.

అందరికి సరుకులు..

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ సరుకులు అందెలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెల్లడించారు. ఆదివారం పట్టణంలోనీ ఆరో వార్డులో ఉన్న రేషన్‌షాపుని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల కోసం రేషన్‌షాపునకు వచ్చిన ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, సంజీవరావు పాల్గొన్నారు.



వల్లప్పచెరువు అలుగు నుంచి పారుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



ప్రవహిస్తున్న వాగుల వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్ నిర్మల

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ బి.నిర్మల ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్షం ప్రభావంతో గ్రామాల్లో జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉధృతంగా పారుతున్న వాగులను పరిశీలించారు. ఉధృతిగా ప్రవహిస్తున్న వాగుల వద్ద, చప్టాల వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. అలాగే వాగుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న, కాపలాగా ఉన్న రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంతెనలకు, చప్టాలకు రోడ్డుపై వరదనీటికి వచ్చి అడ్డుగా నిలిచిన చెత్తాచెదారం వెంటనే తొలగించాలని సూచించారు. వరద పూర్తిగా తగ్గే వరకు రాకపోకలను పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే పూర్తిగా రాకపోకలను నిలిపి వేయాలని సూచించారు.



నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్

నరసరావుపేట పట్టణంలోని బాపనయ్యనగర్, ప్రకాష్‌నగర్‌లోని వర్షం నీరు కాలనీలోకి రావడంతో ఇళ్లు నీట మునిగాయి. పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్ ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించారు.



తుంగపాడులో వర్షానికి పడిపోయిన ఇల్లు



ఉధృతిగా ప్రవహిస్తున్న గాడిద వాగు



చినకంచర్ల కొంకెరువాగు వంతెనపై ముళ్లకంచెను పొక్లెయిన్ ద్వారా తొలిగిస్తున్న పోలీసులు



కొత్తలూరులో కొంకెరు వాగు ఉధృతి పరిశీలిస్తున్న ఎస్ఐ లోకేష్‌రావు



గణపవరంలో కుప్పగంజివాగు చప్టాపై 4 అడుగుల మేర ప్రవహిస్తున్న వరద నీరు

పొలాల్లో సస్య రక్షణ చర్యలు



కావూరు డొంక రోడ్డులో పత్తి చేను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి హరిప్రసాద్



కొత్తపల్లిలో నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారుల బృందం

నాదెండ్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు వెళ్లబెట్టేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.హరిప్రసాద్ చెప్పారు. గణపవరం నుంచి కావూరు వెళ్లే డొంక రోడ్డులో నీట మునిగిన పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వర్షం మెట్ట భూమికి మేలు చేకూర్చిందన్నారు. లోతట్టు పొలాల్లో అక్కడక్కడా వర్షం నీరు నిల్వ ఉన్నందున, పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంతర కృషి అనంతరం పొలాలు ఆరాక పైపాటుగా మల్టీకే (13-0-45) 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటర్‌నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 90 రోజులలోపు వయస్సున్న పత్తి పంటలో బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎకరాకు పైపాటుగా వేసుకోవాలని కోరారు. ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటామైసిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే ఫలితం ఉంటుందని సూచించారు. కంది, మినుము పైర్లలో కూడా పై పద్ధతులు పాటించాలని సూచించారు.

పంటల పరిశీలన

నరసరావుపేట రూరల్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు ఆదివారం పరిశీలించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి శివలలితలు మండలంలోని కేఎం అగ్రహారం, రావిపాడు, పాలపాడు గ్రామాల్లో పర్యటించారు.

వినుకొండ(నూజెండ్ల): వర్షాలకు రైతులు పొలాల్లో పలు జాగ్రత్తలు పాటించాలని ఏఓ కె.అంజిరెడ్డి తెలిపారు. వరి పంటలో వర్షంనీటిని తీసివేసి 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపీ అదనంగా వేసుకోవాలన్నారు. పొటాష్ తప్పనిసరిగా పిచికారి చేసుకోవాలని చెప్పారు. నేరుగా విత్తన వరిలో నెల రోజుల లోగా ఉన్న పంటలో మొక్కలు చనిపోయినట్లయితే ఒత్తుగా ఉన్న చోట మొక్కలను పీకి నాటుకోవాలని సూచించారు. ఎలుకల ఉధృతి ఎక్కువయే అవకాశం దృష్ట్యా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పత్తి పొలంలో అంతర కృషి చేసి పొలం ఆరేలా చూడాలన్నారు. మల్టీ కె 10 గ్రాములు లేదా పోలిఫీడ్ 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పలు తెగుళ్ల రాకుండా ఉండేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.


వర్షంతో మిరప పంటకు తెగుళ్లు

బొల్లాపల్లి: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ అవగాహన కల్పించారు. వర్షం కారణంగా పొలంలో చేరిన నీటిని వెంటనే బయటకు పంపించి వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 10గ్రాముల యూరియా ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా 25 కిలోల ఎంవోపీ, 200 కిలోల వేపపిండిని కలిపిన మిశ్రమాన్ని పొలంలో చల్లాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలి. పొలంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్నందున ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్లన ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు పంటను ఆశించే అవకాశం ఉందని, బ్యాక్టీరియా ఆకుమచ్చ కానోఫోరా వంటి తెగుళ్ల ఆశించే అవశం ఉందని వీటి నివారణకు ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నరసరావుపేట రూరల్: మండలంలోని గురవాయపాలెంలో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు దాడి చేసి నలుగురు పేకాట రాయళ్లను అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ కిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిలో పాల్గొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మాస శివరాత్రి పూజలు



రొంపిచర్ల: మండలంలోని అన్ని శివాలయాల్లో ఆదివారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహాన్యాసక పూర్వక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. విప్పర్లలో వేంచేసిన గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

లక్ష పుష్పార్చన



నకరికల్లు: శ్రావణ మాసం మాసశివరాత్రి వేడుకలను ఆదివారం ఆలయాల్లో నిర్వహించారు. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసరావు విశేష పూజలు చేశారు. విశేష ద్రవ్యాలు అభిషేకాలు గావించారు. అమ్మవార్లకు లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.